


**నా**కు కొంచెం బద్ధకం ఎక్కువని ఒప్పుకుంటాను. ఇదుగో ఈ పని చూద్దాం, చేద్దాం అనుకుంటూ ఉండగానే, నిమిషాలు, గంటలు గంటల, రోజులు రోజులు వారాలూ నెలలూ అయిపోతూ ఉంటాయి. అంచేత చాలా పనులను చివరివరకూ తాత్సారంచేసి, ఆఖరిగడియలో హడావుడిగా పూర్తయిందనిపించటం నాకో అలవాటుగా తయారైంది. ఈ అలవాటును మార్చుకోవాలని ఎప్పటికప్పుడు అనుకుంటూనే ఉన్నాను గాని, దానికి బద్ధకమే అడ్డొస్తోంది.

పేపర్లు నాకు పంపించి పదిహేనురోజులు అయిపోయింది. మరో రెండుమూడు రోజుల్లో ఈ పరీక్ష పేపర్లన్నీ దిద్ది, మార్క్స్‌లిస్ట్ తయారుచేసి, పోస్టులో పంపించెయ్యాలి. ఈ పదిహేను రోజుల్లో సగమన్నా కాలేదు. గడువు దగ్గరపడింది కాబట్టి, ఇంక ఈ రెండు రోజులూ దీక్షగా కూర్చుంటే గాని పూర్తి చెయ్యటం వీలుపడదు.

అంచేత అవసరాలన్నీ తీర్చుకున్నాను. గదిలో కూర్చున్నాను. ఊసుపోక కబుర్లు చెప్పటానికొచ్చి గంటలకొద్దీ టైంపాడుచేసే ఇరుగుపొరుగువాళ్ళనుంచీ, స్నేహితులనుంచీ తప్పించుకోవటంకోసం గదితలుపులు వేసుకున్నాను. ఎవరైనా వచ్చిఅడిగితే, ఇంట్లో లేనని చెప్పమని ఇల్లాలికి చెప్పాను. అరగంటకొకసారి కాఫీపంపమనికూడా చెప్పాను

రెండు సిగరెట్టుపెట్టెలు, పేపర్ల కట్టలూ ముందేసుకొని కూర్చున్నాను.

ఏ మాటకామాటే చెప్పాలి. చదువుచెప్పటంలో నయితేనేం, పరీక్షలు గట్టెక్కటంలో నయితేనేం అడ్డుదోవల కోసం వెతుక్కునే వాళ్ళను నేను క్షమించలేను. పాఠాలు చెప్పటంలో నేను ఎంత కచ్చితంగా ఉంటానో, ఈ పేపర్లు దిద్దటంలోను అంతకంటే ఎక్కువ నిక్కచ్చిగా ఉంటాను. నేను దిద్దిన పేపరుకు నలభై అయిదు మార్కులు వచ్చాయంటే, ఇంకవేరెవరు దిద్దినా మరో అయిదు మార్కులు ఎక్కువ రావల్సిందేగాని ఎట్టి పరిస్థితిలోనూ అంతకన్నా తక్కువ రావటానికి వీల్లేదు. అందుకే మా ఆవిడ హాస్యమాడుతూ ఉంటుంది, నేను పేపర్లు దిద్దేటప్పుడు తను ప్రక్కన కూర్చుంటానని. తను ప్రక్కన కూర్చోబట్టే పదిహేనురోజుల్లో పది పేపర్లు కూడా పూర్తికాలేదని నేను చెబుతూ ఉంటాను.

ఒక్క మెతుకు పట్టుకు చూస్తే చాలు, అన్నం ఉడికిందో లేదో చెప్పొచ్చు అలాగే మొదటి ప్రశ్నకు రాసిన సమాధానం చూస్తే చాలు, వాడు ప్యాసవుతాడో తప్పుతాడో ఉజ్జాయింపుగా చెప్పొచ్చు. ఒక్కోసారి ఈ అంచనా తప్పుకావచ్చుకూడా. కొన్ని ప్రశ్నలకు బండబూతులురాసి, అసలు వాక్యనిర్మాణమే చేతకానట్లు కనిపించినా, కొన్ని ప్రశ్నలకు చక్కగా అన్నిఅంశాలను పొందుపరుస్తూ సమాధానం రాసిన పేపర్లు కొన్ని మధ్యలో తగులుతుంటాయి. ఈ విద్యార్థుల గురించి నా అనుమానాలు నాకు ఉన్నాయి. అయినా వాడికి రావల్సిన మార్కులు వాడికి వేస్తూ ఉండటం పరిపాటి

రెండు గంటలు గడిచాయి. ముందున్న కట్ట సగమైనా తరగలేదుగాని, సగం సిగరెట్టుపెట్టె అయిపోయింది. ఈ సిగరెట్టు వెధవ అలవాటు. దీన్ని మానెయ్యాలని అనుకుంటూనేఉన్నాను అలవాటుప్రకారం.

మరో పేపరు చేతిలోకి తీసుకున్నాను. ఈ పేపరులో ఏదో ప్రత్యేకత కనిపించింది నాకు. సమాధానాలు రాయటానికి ఇచ్చే పుస్తకం పూర్తయ్యాక, ఇంకా రాయదల్చుకుంటే, ఎడిషనల్ షీట్సు తీసుకుని రాయవచ్చు కానీ ఈ ఎడిషనల్ షీట్సు ఆ పుస్తకానికి చివరన చేర్చి దారంతో ముడివేయాలి. ఈ ప్రబుద్ధుడెవడో ఆ ఎడిషనల్ షీటును మధ్యలో పెట్టి ముడివేశాడు. అందువల్ల ఆ కాగితం సైజు కొంచెం ముందుకొచ్చి ప్రత్యేకంగా దృష్టిని ఆకట్టుకుంది. ఎందుకలా చేశాడా అని ఆ పేజీని తిరగేసి చూద్దునుగదా అందులో ఏదో తెలుగులో రాసి ఉంది. ఉత్సాహం ఆపుకోలేక ముందు అదేమిటో చదివాను.

"అయ్యా, నేను చాలా బీదరాలిని. నాకు తల్లిలేదు గోరుచుట్టుమీదరోకలి పోటు అన్నట్లుగా నా దరిద్రానికి తోడు, మా సవతి తల్లి పోరు భరించలేకుండా ఉన్నాను. ఎన్నో కష్టాలుపడి చదువుకుంటున్నాను. దిక్కులేకుండా ఉన్నాను. అంధకార బంధురమైన నా జీవితానికి, ఒకే ఒక్క వెలుగురేఖ ఈ పరీక్ష పాసయితే నేను తెచ్చుకునే సర్టిఫికెట్టు. దానికోసం నేను ఎంత కష్టపడాలో నాకు తెల్సు అందుకనే ఇంట్లో ఎంత నరకయాతన అనుభవిస్తున్నా, నా చదువుకు ఎంతో ప్రాముఖ్యం ఇస్తూ బాగా చదువుతున్నాను. మీరు నమ్మినా, నమ్మక పోయినా నేను క్లాసులో ఎప్పుడూ నూటికి డెబ్బయి మార్కులు తక్కువ లేకుండా తెచ్చుకుంటున్నాను. నిన్న మా యింట్లో పెద్ద గొడవ

జరిగింది. మా విన్ని నన్ను తన్ని తగిలేసింది. నిష్కారణంగా నాతో పోట్లాడి నన్ను గెంటేసింది. ఒక స్నేహితురాలు ఆదుకుంది. రాత్రంతా వాళ్ళింట్లో ఏడుస్తూ పడుకున్నాను. నా బాధ ఏమని చెప్పను? ఎవరికని చెప్పను? నిన్నటి నుంచి ఏం చెయ్యబోయినా దుఃఖం ముంచుకొస్తోంది. ఈ బాధలో ఈ ఒక్క పేపరూ సరిగా వ్రాయలేక పోయినాను. మిగిలినవన్నీ బాగానే రాసాను. కానీ ఈ పరీక్ష ప్యాసుకాలేకపోతే, నాకు భవిష్యత్తు లేదు. భవిష్యత్ జీవితమూ లేదు. కనక నేను ఈ సర్టిఫికెట్ తెచ్చుకుని, ఏదో ఒక ఉద్యోగం వెతుక్కోవటమా? లేక ఈ నిరాశామయ జీవితంలో ఎదురైన తాకిడికి ఓడిపోయి, నుయ్యో, గొయ్యో వెతుక్కోవడమా? అన్నది తేల్చవల్సింది మీరు. నాకు మీరు ఎటు దారి చూపిస్తే అటు నడుస్తాను. ఇంక ఈ పాపం పుణ్యం—ఆ భారమంతా మీది.

ఇట్లు, మీ సోదరి.''

ఈ ఉత్తరం నన్ను కదిలించిన మాట నిజం. ఎంత దయనీయమైన స్థితిలో ఉన్నదీ అమ్మాయి ! మళ్ళీ మళ్ళీ పై నుంచి క్రిందికి చదివాను. ఆ అమ్మాయి రాసిన ప్రతి వాక్యం, సినిమా చూస్తున్నట్లు నా కళ్ళ ముందు కదిలింది. ఆ భారమంతా నాకు వదిలేశానంటుంది. ఇప్పుడు ఏమిటి చెయ్యటం?

సరే. రాసిన జవాబులు ఎలా ఉన్నాయో చూద్దామని ఒకసారి తిరగేశాను. రెండు మూడు ప్రశ్నలకి బాగానే రాసింది. కానీ ముందు పేపర్లో వ్రాసిన జవాబులకు మక్కికి మక్కిగా ఉన్నాయవి. మరో నాలుగు ప్రశ్నలకు ఆన్సర్స్ రాసినా, వాటికి ఎక్కువ మార్కులు రావు. ఎటు చూసినా బార్డర్ దాటేటట్లు కనిపించటంలేదు. ఆ పేపరు పక్కన పెట్టాను.

మిగిలినవి దిద్దటం మొదలుపెట్టాను. కాసేపటికి భోజనానికి లేచాను. ఏ పని చేస్తున్నా నన్నా ఉత్తరం వెంటాడుతూనే ఉంది.

ఆ అమ్మాయికి కాదు, అసలు పరీక్ష నాకు ఎదురైంది. విద్య యొక్క విలువ నాకు తెల్సు. ఈ పరీక్షల యొక్క ప్రాముఖ్యమూ నాకు తెల్సు. కానీ ఈ విధానంలో కొన్ని లోటుపాట్లున్నాయి. సంవత్సరం పాటు చదివిన చదువును, ఆ మూడు గంటల పరీక్షా సమయంలో రాసిన దాన్ని బట్టి తూకం వేస్తారు. ఆ మూడు గంటలూ ఏ కారణంచేతనైనా విద్యార్థికి ఇబ్బంది కలిగితే, ఇంక వాడు ఏమీ చదవనట్లే లెక్క. అంతేగాదు, తూకం వెయ్యటంలో కూడా ఒక్కోసారి కొంత అన్యాయం జరుగుతూ ఉంటుంది. నలభై నాలుగు మార్కులు వచ్చినవాడు తప్పుతాడు. నలభై అయిదుమార్కులు వచ్చినవాడు గట్టెక్కుతాడు. ఈ ఒక్క మార్కు తెచ్చిపెట్టిన జ్ఞానం ఎంత! ఈ వ్యత్యాసం సహజంగా వాళ్ళ అదృష్టాన్ని బట్టే ఏర్పడుతూ ఉంటుంది. అంతదాకా ఎందుకు, ఒక్కోసారి ప్యాసయిన వాళ్ళ సంఖ్య తక్కువగా ఉంటే, అందరికీ నాలుగయిదు మార్కులు కలిపి, ఉత్తీర్ణులయ్యే వాళ్ళ సంఖ్య పెంచటమూ కద్దు. మరిదీన్ని బట్టి చూస్తే, ఈ పరీక్షలు గట్టెక్కటానికి అవలంబించే ఆపద్ధర్మాలు చాలా ఉన్నాయి. ఇవి గాక, విద్యార్థులు తమ ఆత్రం కొద్దీ ఆచరించే అధర్మాలు ఉండనే ఉన్నాయి. పరీక్షల ముందర ప్రశ్నల పేపర్ల వెంట, ఆ తర్వాత ఆన్సరు పేపర్ల వెంట పరుగెత్తే

వాళ్ళూ, బరితెగించి వాచర్ల ముందరే కాపీలు కొట్టే వాళ్ళూ లేకపోలేదు. ఇంతమంది ఇన్ని రకాలుగా, ఎవరి శక్తియుక్తులను బట్టి వాళ్ళు సర్టిఫికెట్లు సంపాదించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు కానీ పాపం, ఇవేమీ చెయ్యలేని ఈ ఆడపిల్ల. పేదపిల్ల సామర్థ్యం ఉండీ శాపవశాత్తూ కర్ణుడిలా, నిస్సహాయంగా, ఎక్కడో దూరం నుంచి నావంకే జాలిగా చూస్తున్నట్లు నాకు కనిపించింది. 'ఈ పాపం, పుణ్యం మీదే, మీదే' అంటున్నట్లు అనిపించింది.

రెండుమూడు సార్లు ఆ పేపరు దిద్దటానికి పూనుకుని కూడా, మనసు ఎటూ నిర్ధారణ చేసుకోలేక మానుకున్నాను. డబ్బుకోసం మార్కులు ఎక్కువ వేసినవాళ్ళు ఉన్నారని నాకు తెలుసు. పలుకుబడికీ, పరపతికీ, బంధుప్రీతికీ లొంగిపోయి ఎక్కువ మార్కులు వేసినవాళ్ళు ఉన్నారని నాకు తెలుసు. కానీ ఈ పరిస్థితి ఎవరికీ ఎదురై ఉండదు. కేవలం మానవత్వానికి లొంగిపోయి, ఒక బీద పిల్లకి జరుగుతున్న అన్యాయాన్ని అరికట్టడానికి నాకు చేతనయిన ఈ చిన్న సాయం చెయ్యటంలో తప్పులేదని చివరికి ఒక నిర్ణయానికి వచ్చాను.

ఈ వ్యవహారం పూర్తిచేసి, పంపించాక, ఇంక ఆ విషయం మర్చిపోయాను. మూడు నెలలు గడిచి పొయ్యాయి. ఈ మధ్యలో ఒకటి రెండు సార్లు ఆ అజ్ఞాత వ్యక్తి నాకు గుర్తొచ్చింది. నేనెవరో ఆమెకు తెలియదు. ఆమె ఎవరో నాకూ తెలియదు. నేను చేసిన సాయాన్ని ఆమె ఈ పాటికి గుర్తించే ఉంటుంది. మౌనంగా కృతజ్ఞతలు చెప్పుకునే ఉంటుంది. నాక్కావలసిందల్లా ఆ అమ్మాయి జీవితంలో స్థిరపడటమే ! కనిపించని ఈ అనుబంధం నాకే చిత్రంగా కనిపించింది.

లక్ష్మి అత్తవారింటి నుంచి వచ్చింది. స్టేషనుకు వెళ్ళి తీసుకొచ్చాను. వచ్చినప్పటి నుంచీ, వాళ్ళ అత్తవారింటి విశేషాలన్నీ నాకూ, వాళ్ళ వదినకూ చెబుతూనే ఉంది నేను విననట్లు, విన్నట్లూ—వాళ్ళ సంభాషణలో భాగం పంచుకుంటున్నాను.

మధ్యాహ్నం నిద్రలేచాక, వంటింట్లో కూర్చున్నాం. మా ఆవిడ పకోడీలు వేయిస్తోంది. లక్ష్మి మిగిలిపోయిన విశేషాలు వల్లిస్తోంది.

"అవునే, మీ మరిది పరీక్ష ఏమయింది?" అని అడిగింది ఆవిడ.

లక్ష్మి నవ్వింది. "ఈ సారి ప్యాసయినాడు వదినా. ఎట్లా అని అడగవేం ? బలే గమ్మత్తు చేశాడు ప్రతి పేపర్లోనూ 'నేనొక దిక్కులేని ఆడపిల్లనీ, మా సవతితల్లి కష్టాలు భరించలేక, పరీక్షకు సరిగ్గా చదవలేదు, మీరు ప్యాసు చెయ్యకపోతే నేను చచ్చిపోతాను' అని రాశాట్ట. అలా రాస్తే ఎలాంటి వాడికైనా అయ్యోపాపం అనిపిస్తుంది కదా.. అలా ప్యాసయ్యాడట. ఇదిజరిగాక అందరం ఒక టేనవ్వుకోవటం......"

"పోన్లే, ఎలాగయితేనేం తనూ సర్టిఫికెట్టు తెచ్చుకున్నాడు, అదీ కావల్సింది... ఏమండీ, మీకు రెండు పకోడీలు వెయ్యనా?" అని అడుగుతున్న మా ఆవిడ మాటలు నాకు వినిపించలేదు.

వాడి పరీక్ష మాటకేంగాని నీకు జరిగిన పరీక్షలో నువ్వు మోసపొయ్యావు. *